# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శనివారం | 11 జులై , 2026 | పేజీలు : 6


## విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆచార్య ఉపకులపతి ప్రొఫసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఆకాంక్షించారు.శుక్రవారం మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో క్రీడా అంశాలపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలను అందిస్తామని, క్రీడాకారులను ఎల్లప్పుడూ ప్రోత్సహించేందుకు విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందని తెలిపారు. 2026/27 ఆర్థిక సంవత్సరానికి 26 క్రీడా అంశాలకు సంబంధించిన స్పోర్ట్స్ బోర్డు బడ్జెట్‌ను ఆమోదించారు. విశ్వవిద్యాలయంలో క్రీడల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన క్రీడా సౌకర్యాల కల్పన,అంతర్విశ్వవిద్యాలయ క్రీడా పోటీల నిర్వహణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈసమావేశంలో యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రెటరీ డాక్టర్ కే హరీష్ కుమార్,ఫ్యాకల్టీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డీన్ ప్రొఫసర్ రాజేష్ కుమార్, ప్రొఫసర్ వసంత, డాక్టర్ మిర్యాల రమేష్ కుమార్ పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గ్రామ పంచాయితీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గ్రామ పంచాయితీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హుజూర్‌నగర్, సూర్యాపేటకు చెందిన సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామ పంచాయితీల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకొని చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు మంజూరైన నిధులతో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రతి గ్రామ పంచాయితీ తమ పరిధిలో ఉన్న సహజ వనరులు, స్థానిక ఆదాయ మార్గాలను గుర్తించి పంచాయితీ ఆదాయాన్ని పెంచుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. గ్రామ పంచాయితీలు ఆర్థికంగా బలోపేతం అయితేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి వచ్చిన ప్రధాన సమస్యలను ప్రతి గ్రామ పంచాయితీ గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామ పంచాయితీ రాబోయే మూడు సంవత్సరాల కాలానికి గ్రామ పంచాయితీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జిపిడిపి)ను రూపొందించుకోవాలని సూచించారు. ప్రణాళిక తయారీలో ప్రధానంగా ఏడు అంశాలపై వివిధ శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించుకోవాలని తెలిపారు. గ్రామ పంచాయితీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కేవలం పత్రాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఈఓ శిరీష, డిఆర్‌డిఓ సన్యాసయ్య, డిపిఓ యాదగిరి, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, ఇతర అధికారులు ఇంజనీర్లు పాల్గొన్నారు.



# పిఏసిఎస్ చైర్మన్‌గా అండెం సంజీవరెడ్డి

### పిఏసిఎస్ నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే బీర్ల

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన పాలకవర్గం ఎన్నుకోవడం జరిగింది. ఈసందర్భంగా పిఏసిఎస్ చైర్మన్‌గా అండెం సంజీవరెడ్డితో పాటు 13 మంది డైరెక్టర్లను ఎన్నుకున్నారు. శుక్రవారం పిఏసిఎస్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య పాల్గొని నూతనంగా నియమితులైన పాలక వర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి వారికి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలుపుతూ రైతుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. రైతులకు అవసరమైన రుణాలు, ఎరువులు, విత్తనాలు, ధన్యాం కొనుగోలు, సహకార సేవలు పారదర్శకంగా అందించి పిఏసిఎస్‌లను మరింత బలోపేతం చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సహకార సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసారపు యాదగిరిగౌడ్, మండల పార్టీ అధ్యక్షులు ఇమ్మడి దశరథ గుప్త, చేనేత సంఘం చైర్మన్ చిందం ప్రకాష్, మాజీ జెడ్పిటిసి యాదగిరి, మాజీ ఎంపిపి వేణుగోపాల్, హరితాదేవి, సర్పంచులు ఐలయ్య, అనల్, నాగిరెడ్డి, రమేష్, బ్యాంక్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, సహకార శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను 15లోపు పూర్తి చేయాలి

### డిజిటలైజేషన్‌ను 86కు పెంచాలని కలెక్టర్ ఆదేశం




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** సర్ ప్రక్రియపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఈ నెల 15వ తేదీలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఈఆర్వోలు,ఏఈఆర్వోలతో సర్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.కేంద్ర ఎన్నికల కమిషన్ వీసీలో జిల్లాలో 48 శాతం డిజిటలైజేషన్ పూర్తిచేసినందుకు అభినందనలు తెలిపిందని పేర్కొన్నారు.డిజిటలైజేషన్‌లో వెనుకబడిన బీఎల్ఓలపై ప్రత్యేక దృష్టి సారించాలని,ప్రస్తుతం 30 శాతం కంటే తక్కువ చేసిన బీఎల్ఓలు రేపు, ఎల్లుండిలోగా కనీసం 50 శాతానికి చేరుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం 48 శాతం డిజిటలైజేషన్ పూర్తయినా,రానున్న రెండు రోజుల్లో 86 శాతం పూర్తి చేయాలన్నారు.మరణించిన ఓటర్లు 1,458 ఉండగా,ఇప్పటివరకు 399మందిని తొలగించామని, మిగిలిన వాటిని వెంటనే పరిశీలించి పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లాలో 86 శాతం మ్యాపింగ్ పూర్తయిందని,ప్రతి బీఎల్ఓ తాను మ్యాపింగ్ చేసిన జాబితాతో క్షేత్రస్థాయికి వెళ్లి డిజిటలైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు.భూభారతి,13 ఏ ఫారాలు,సాధా బైనామాలకు సంబంధించిన పెండింగ్ అంశాలను వెంటనే పరిష్కరించాలని అన్నారు.జిల్లాలో 70 గ్రామాల్లో రీసర్వే చేపడుతున్నామని, ఈ సోమవారం నుంచి ప్రారంభమవుతుందని, సర్వేకు జూనియర్ అసిస్టెంట్లకు 10 రోజుల శిక్షణ ఇస్తామని తెలిపారు. 33 మందికి సోమవారం లోపు ఉత్తర్వులు జారీ చేసి కలెక్టరేట్‌లో విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ‘సర్’లో ఖచ్చితత్వానికి ప్రాధాన్యం

### బాదలాపురం, గూడూరులో ఆర్డీఓ తనిఖీలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రత్యేక ఓటరు విస్తృత సవరణ సర్వే (SIR) ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించి తప్పులులేని ఓటరు జాబితా రూపొందించాలని మిర్యాలగూడ ఆర్డీవో, ఓటరు నమోదు అధికారి ఎస్.రమణారెడ్డి సూచించారు. మిర్యాలగూడ మండలంలోని బాధలాపురం, గూడూరు గ్రామాల్లో కొనసాగుతున్న ఇంటింటి గణన కార్యక్రమాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. బాదలాపురం గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నంబర్ 179 పరిధిలో జరుగుతున్న సర్వేను పరిశీలించిన ఆర్డీవో, ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం గూడూరు గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నంబర్లు 190, 191 పరిధిలో ఇంటింటి గణన తీరును తనిఖీ చేశారు. సర్వేలో నమోదు చేసిన వివరాలు ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాలని సూచించారు.ఓటర్ల నుంచి సేకరించిన సమాచారాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. వివరాల నమోదులో నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఓటరుకు సంబంధించిన సమాచారం స్పష్టంగా నమోదు కావాలని పేర్కొన్నారు. ఓటరు జాబితా ఎన్నికల ప్రక్రియకు పునాది కావడంతో ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని తెలిపారు.ప్రత్యేక సవరణ కార్యక్రమంలో బూత్ లెవెల్ ఏజెంట్లు కూడా చురుకుగా పాల్గొని బీఎల్‌ఓలకు సహకరించాలని సూచించారు. గ్రామ స్థాయిలో అవగాహన పెంచి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఆర్ఐ కృష్ణయ్య, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.





## రైతు సంక్షేమమే ధ్యేయంగా అడుగులు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్రంలోని అన్నదాతలకు పెట్టుబడి సహాయం అందించే క్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఖమ్మం జిల్లా చింతకాని నుండి ఒకే క్లిక్‌తో రూ. 1009.15 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేశారు. దీని ద్వారా రాష్ట్రంలోని 1.44 లక్షల మంది సాగుదారులు లబ్ధి పొందనున్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని మిర్యాలగూడ మండల కొత్తగూడెం రైతు వేదికలో స్థానిక వ్యవసాయ శాఖ ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ స్క్రీన్ల ద్వారా రైతులకు ప్రత్యక్షంగా చూపించింది. మండల వ్యవసాయ అధికారి రుషేంద్రమణి పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశానికి పరిసర గ్రామాల నుండి దాదాపు 150 మంది సాగుదారులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో కిసాన్ విభాగం జిల్లా ప్రెసిడెంట్ ముదిరెడ్డి నర్సిరెడ్డి, కాంగ్రెస్ పట్టణ ప్రెసిడెంట్ నూకల వేణుగోపాల్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు పార్వతి, నాగయ్య, అఫ్రీన్, గోపి, రైతులు ఇజ్రాయెల్, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకులు ధీరావత్ హన్యానాయక్ ఐకాన్ సోషల్ వర్కర్ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఐ స్క్వేర్ యూనివర్సల్ సంస్థ ఎడ్యుకేషన్ అండ్ సోషల్ వర్క్ విభాగంలో దేశవ్యాప్తంగా ఉత్తమ సేవకులను ఎంపిక చేయగా, విద్యా, లీడర్‌షిప్ అవార్డు విభాగంలో బెస్ట్ సోషల్ వర్కర్‌గా తనను ఎంపిక చేసి అవార్డు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. బెంగళూరులో నిర్వహించిన ప్రదానోత్సవంలో అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ఇదే ఉత్సాహంతో సేవలను విస్తృతపరుస్తానని, అనాథలతో పాటు ప్రత్యేక అవసరాలు గల వారికి, యాచకులకు సేవ చేస్తామన్నారు. కాగా అవార్డు అందుకున్న హన్యానాయక్‌ను మేధావులు, విద్యావేత్తలు, వివిధ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభినందించారు.

## ప్రజాక్షేమం కోసమే టిడిపి నిరంతర కృషి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ వారి కష్ట సుఖాల్లో తోడుగా నిలుస్తుందని టీటీడీపీ నాయకులు పోగుల సైదులు గౌడ్ శుక్రవారం తెలిపారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాల పంపిణీ చేయడంలో, ప్రజా సంక్షేమ పథకాల అమలులో ప్రస్తుత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ప్రైవేట్ పాఠశాలల్లో సాగుతున్న అడ్డగోలు ఫీజుల దోపిడీని అరికట్టాలని, కాలేజీ విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్ బాకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పల్లె, పట్టణ ప్రాంతాల్లో మురుగు కాలువలు, రోడ్ల నిర్మాణాలు, ఫ్లై ఓవర్ల పనులు నిలిచిపోయాయని, తీవ్రమైన నీటి ఎద్దడి, కరెంట్ కోతలు వంటి సమస్యలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మళ్లీ తెలుగుదేశం పార్టీ పాలన రావాలని ప్రజలంతా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

## సూర్యాపేటకు రైల్వే లైన్ సాధించేదాకా పోరాటం ఆగదు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేటకు రైల్వే లైన్ సాధించేదాకా పోరాటం ఆగదని రైల్వే సాధన సమితి కన్వీనర్ దేగల జనార్ధన్, కోకన్వీనర్ రాచూరి ప్రతాప్, గౌరవ అధ్యక్షులు డాక్టర్ రంగారెడ్డి, గౌరవ సలహదారు లింగంపల్లి భద్రయ్య స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాకు రైల్వే లైన్ విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సరిదిద్దాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రతిపాదించిన విధంగా హైదరాబాద్ సూర్యాపేట ఖమ్మం రైల్వే మార్గం, అలాగే సూర్యాపేట కర్నూలు రైల్వే లైన్ అమలైతే సూర్యాపేట దక్షిణ తెలంగాణలో కీలక రైల్వే జంక్షన్‌గా ఎదుగుతుందని ప్రజలు ఎంతో ఆశించారని గుర్తు చేశారు. అనంతరం ఖమ్మం మార్గాన్ని మార్చి దాచేపల్లి వైపు మళ్ళించడం ద్వారా సూర్యాపేట ప్రజల ఆశలను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట చారిత్రక, భౌగోళిక, వాణిజ్యపరంగా అత్యంత ప్రాధాన్యం కలిగిన పట్టణమన్నారు. సూర్యాపేట ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ఇకపై సహించబోమని స్పష్టం చేశారు. సూర్యాపేట రైల్వే లైన్ సాధన కోసం విశాల ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ ఉద్యమానికి రాజకీయ రంగులు పులమకుండా పౌర సమాజం ముందుండి నాయకత్వం వహించాలని, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ, కార్మిక, రైతు, యువజన, విద్యార్థి, మహిళా సంఘాలు ఈ ఉద్యమానికి సంఘీభావం ప్రకటించి కార్యాచరణలో భాగస్వాములు కావాలని కోరారు.

## వర్షపు నీటిని ఒడిసిపడదాం



**ప్రజాపక్షం/ మిర్యాలగ్గూడ:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్యాచ్ ది రైన్ ఉద్యమంలో భాగంగా మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయ సిబ్బంది మున్సిపల్ కమిషనర్ శ్రీజరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జల ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు ఆదర్శంగా నిలిచేందుకు తొలుత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోనే వర్షపు నీటి నిల్వ గుంతలను నిర్మించనున్నట్లు ప్రకటించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, విస్తరిస్తున్న సిమెంట్ రోడ్ల కారణంగా వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా వృధాగా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో రాబోయే నీటి ఎద్దడిని అరికట్టడానికి ప్రతి ఇంట్లోనూ వర్షపు నీటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ విషయమై పట్టణ ప్రజల్లో అవగాహన పెంచేందుకు మున్సిపాలిటీ తరపున ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడ వర్షం కురిస్తే అక్కడ ఎప్పుడు కురిస్తే అప్పుడు ఆ నీటిని భూమిలోకి మళ్లించేలా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పిహెచ్‌డి పట్టా సాధించిన వినయ్ కుమార్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యుత్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డా. పెరుమండ్ల వినయ్ కుమార్ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పట్టాను సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. దీపకుంట గ్రామానికి చెందిన పెరుమండ్ల రాములు, సావిత్రమ్మ దంపతుల ప్రథమ పుత్రుడైన వినయ్ కుమార్ విద్యా రంగంలో మరో కీలక విజయాన్ని అందుకున్నారు. ఎన్‌హాన్స్ మల్టీఫంక్షనల్ ఈవీ ఛార్జర్ పెర్ఫార్మెన్స్ విత్ బైడైరెక్షనల్ సెపిక్ కన్వర్టర్ అండ్ ఫ్ఏఎన్ఎఫ్ఐఎస్ కంట్రోల్ ఫర్ గ్రిడ్‌కనెక్టెడ్ పీవీ సిస్టమ్ అనే అంశంపై ఆయన పరిశోధన పూర్తి చేశారు. ఈ పరిశోధనను ప్రొఫెసర్ పి.వి. ప్రసాద్ పర్యవేక్షణలో, ప్రొఫెసర్ ఈ. విద్యాసాగర్ సహ పర్యవేక్షణలో పూర్తి చేశారు. విద్యార్థి దశ నుంచే సాంకేతిక పరిశోధనలపై ఆసక్తి పెంచుకున్న వినయ్ కుమార్ విద్యుత్ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే అంశాలపై లోతైన అధ్యయనం నిర్వహించారు. ఈ విజయంపై వినయ్ కుమార్ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల కష్టాలు, గురువుల మార్గదర్శకత్వం, కుటుంబ సభ్యుల సహకారం లేకుండా ఈ స్థాయికి చేరుకోవడం సాధ్యపడేదికాదని తెలిపారు. సతీమణి శైలజ, కుమార్తెలు జైత్విక, చరిష్మ, సోదరులు విజయ్ కుమార్, చేంతన్ బాబు అందించిన ప్రోత్సాహం తనకు మరింత ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందన్నారు. డా. బి.ఆర్.అంబేద్కర్ విద్యా సందేశాలు తన ప్రయాణానికి స్ఫూర్తిగా నిలిచాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నాయకులు, డా. బి.ఆర్.అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ సభ్యులు, బీటీఎస్ నల్గొండ సభ్యులు, అధ్యాపకులు, పరిశోధకులు, దీపకుంట గ్రామ ప్రజలు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు డా. పెరుమండ్ల వినయ్ కుమార్‌ను అభినందించారు.

## నవోదయలో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ పరిధిలోని జవహర్ నవోదయ విద్యాలయం (సూర్యాపేట) 202728 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైనట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ బి. ఆదినారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రతిభావంతులైన గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జూలై 31 ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదిని తెలిపారు. ప్రవేశ పరీక్ష 2026 నవంబర్ 28న నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి/ఏప్రిల్ 2027న ఫలితాలు విడుదల అవుతాయన్నారు. అభ్యర్థి తప్పనిసరిగా సూర్యాపేట జిల్లాకు చెందిన వారై ఉండాలని, ప్రస్తుతం 202627 విద్యాసంవత్సరంలో జిల్లాలో ఏదైనా ప్రభుత్వ లేదా ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతు ఉండాలని, విద్యార్థుల వయో పరిమితి 01.05.2015 నుంచి 31.07.2017 మధ్య జన్మించి ఉండాలని వివరించారు. https://cbseitms.rcil.gov.in/nvs/ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర సమాచారం కోసం నవోదయ విద్యాలయ, సూర్యాపేట సెల్ 6300624049ను సంప్రదించాలని కోరారు.



## నిబంధనలకు అనుగుణంగా ఓటరు నమోదు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా సాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పారదర్శకంగా సాగాలని శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని 4వ వార్డులోని 126వ పోలింగ్ కేంద్రానికి విచ్చేసిన ఆయన, ఓటర్ల జాబితా సవరణ పనులను ప్రత్యక్షంగా చూశారు. కేంద్రంలో కొత్త ఓటర్ల నమోదు దరఖాస్తులు ఏ మేరకు వస్తున్నాయి, తప్పుల సవరణల ప్రక్రియ ఎలా సాగుతోంది, ప్రజల నుండి అందుతున్న ధ్రువపత్రాల పరిశీలన ఏ పద్ధతిలో చేస్తున్నారనే విషయాలపై అధికారులతో మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు ఝాన్సీ రాణి యాదవ్, ముదిరెడి నర్సిరెడ్డి, రెహమాన్, కమల్ తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల త్యాగాలు మరువలేనివి



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** 30 ఏండ్ల గొర్రెల మేకల పెంపకందారుల ఉద్యమ ప్రస్థానంలో అమరవీరులు చేసిన అసమాన త్యాగాలు మరువలేనివని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కిల్లె గోపాల్ అన్నారు. శుక్రవారం జనగామ జిల్లా కడివెండి గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య స్మారక స్థూపం నుండి ప్రారంభమైన అమరవీరుల యాదిలో స్ఫూర్తియాత్ర మండలంలోని లింగాల గ్రామంలో లొడంగి బాలస్వామి కుటుంబ సభ్యులను యాత్ర బృందం పరామర్శించింది. అనంతరం వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొల్లం అశోక్, చల్ల మల్లయ్య, జిల్లెల్ల పెంటయ్య, మట్టిపెల్లి సైదులు, గుంజ వెంకటేశ్వర్లు, రణపంగ కృష్ణ, లొడంగి రామస్వామి, పాశం వెంకటనారాయణ, లొడంగి శ్రీరాములు, అబ్రు పాల్గొన్నారు.

## బాధ్యతగా మొక్కలు నాటాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది కోరారు. శుక్రవారం వనమహోత్సవం సందర్భంగా పట్టణంలోని 40వ వార్డు నందు వనమహోత్సవం కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని అన్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అధిక సంఖ్యలో మొక్కలు నాటుతామన్నారు. గ్లోబల్ వార్మింగ్‌కు చెక్ పెట్టాలంటే ప్రపంచ వ్యాప్తంగా మొక్కలు నాటి పెంచాలని అందులో భాగంగా మున్సిపల్ పరిధిలో విస్తృతంగా మొక్కలు నాటుతామన్నారు. కమీషనర్ హనుమంత రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో 6 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్ కొణతం రాజేష్ రెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.





## మహిళ ఎస్ఐకు ఘన స్వాగతం

**ప్రజాపక్షం/నడిగూడెం:** నూతనంగా బాధ్యతలు చేపట్టిన మహిళ ఎస్ఐ తేజస్విని మండలంలో ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం మండలంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు, వివిధ సంఘాల నాయకులు మహిళ ఎస్ఐని పోలీస్ స్టేషన్‌లో కలిసి ఘన స్వాగతం పలికారు. గతంలో నడిగూడెం పోలీస్‌స్టేషన్‌లో పురుషులు ఎస్ఐలుగా విధులు నిర్వహించగా నూతనంగా మహిళ అధికారి పదవి బాధ్యతలు చేపట్టడంతో ఆమెకు మండల వాసులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మొక్క బిక్షపతి, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీనివాస్, సర్పంచ్ దున్న శ్రీనివాస్, బాణాల నాగరాజు, వీరయ్య, నిరంజన్ పాల్గొన్నారు.

## నేడు ఎఐటియుసి మండల మహాసభ

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ఏఐటియుసి 4వ మండల మహాసభ నేడు నారాయణపురం మండల కేంద్రంలో రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ మండల అధ్యక్ష కార్యదర్శులు దుబ్బాక సంజీవ, చిలివేరు అంజయ్య తెలిపారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎండి ఇమ్రాన్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి సత్యనారాయణ, హాజరుకానున్నారు. మహాసభలో కార్మికుల హక్కుల పరిరక్షణ, కనీస వేతనాలు అమలు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు, సామాజిక భద్రత కార్మిక చట్టాల అమలు ఉపాధి భద్రతతో పాటు కార్మిక ఉద్యమ బలోపేతంపై విస్తృతంగా చర్చించనున్నారు. అనంతరం పలు ముఖ్యమైన తీర్మానాలను ఆమోదించే అవకాశం ఉండొచ్చని నిర్వాహకులు వెల్లడించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని రంగాల కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై ఈ మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

## బ్లాక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా నాగిరెడ్డి స్వప్న

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** మండలంలోని మర్యాల గ్రామానికి చెందిన నాగిరెడ్డి స్వప్న కరుణాకర్ రెడ్డి మండల బ్లాక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. శుక్రవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఫకీర్ సంగీత శ్రీకాంత్ రెడ్డి, జిల్లా నాయకులు పడమటి పావని పాల్గొన్నారు.




## నిధుల కేటాయింపు నిర్లక్ష్యంపై సర్పంచ్‌ల ఆందోళన

**ప్రజాపక్షం/మోతె :** నిధుల కేటాయింపుపై అధికారులు వివక్షతను చాటుకుంటున్నారని శుక్రవారం మండల కేంద్రంలో యంపిడిఓ కార్యాలయం ముందు బిఆర్ఎస్‌కు చెందిన సర్పంచులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వారం సర్పంచ్ మూడు నగేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు కక్ష్య కట్టి సర్వారం, హుస్సేనాబాద్, రావిపహాడ్, అన్నారిగూడెం, తుమ్మగూడెం, కర్కాయలగూడెం గ్రామాలకు కేటాయించడం లేదని మండిపడ్డారు. ఇప్పటికి రెండు దఫాలుగా నిధులు సుమారు 22 గ్రామాలకు కేటాయించి మాకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఉపాధి హామీ నిధులు ప్రతి గ్రామానికి 30 శాతం ఇస్తున్నారని మెటీరియల్ ఖర్చులకు గ్రామంలో జరిగే పనులకు కేటాయించి చేయవల్సిన పనులు నిలిచిపోతున్నాయని తెలిపారు. మల్టీపర్పస్ వర్కర్లకు రోజువారీగా ఎలాంటి పనులు చేయకుండా జీతాలు ఇవ్వాలని అధికారులు చెబుతున్నారని మా ఆరు గ్రామ పంచాయితీలపై అధికారుల



పెత్తనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు ఇచ్చే కాడ నిర్లక్ష్యం చేయడం ఎందుకని ప్రశ్నించారు. శాంతియుతంగా ధర్నా చేస్తున్న మాకు ఎలాంటి పర్మిషన్ లేదంటూ పోలీసులు ధర్నా చేయకుండా అడ్డుకోవడం సరైందికాదన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి మాకు రావల్సిన నిధులు మంజూరు చేసి మా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరు గ్రామాల సర్పంచులు సుప్రజ, లింగయ్య, ధనమ్మ శ్రీరాములు పాల్గొన్నారు.

## పర్యవేక్షణాధికారిని నియమించాలి




**ప్రజాపక్షం/రామన్నపేట :** ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖకు వైద్య విధాన పరిషత్ కమిషనర్ ను వెంటనే నియమించాలని బ్రాంచ్ అధ్యక్షులు టి.శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానాలో ప్రభుత్వ వైద్య,ఆరోగ్య శాఖలో అతి కీలకమైన వైద్య విధాన పరిషత్ లో గత కమిషనర్ మే నెలలో పదవీ విరమణ చేసినప్పటికీ, ఇంతవరకు ఆ స్థానంలో ఎవరినీ పూర్తిస్థాయి పర్యవేక్షణాధికారిని నియమించకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా తమ ఆకాంక్షను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి జాయింట్ యాక్షన్ కమిటీ, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో నిరసన ప్రదర్శననిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ కు బదిలీ అయిన హాస్పిటల్స్ లో పనిచేస్తున్న టీ వీ వీ పీ ఉద్యోగులను టీ వీ వీ పీ హాస్పిటల్స్ లో సర్దుబాటు ప్రక్రియ ఆలస్యం కావడం,సాధారణ బదిలీలలో ఏర్పడ్డ సమస్యలపై సరైన చర్యలు తీసుకోవడం, ఉద్యోగుల పదోన్నతులు, ఉద్యోగుల సర్వీసెస్ క్రమదద్ధీకరణ నిలిచిపోవడం, 190 జీ.ఓ అమలులో జాప్యం కావడం, కాంట్రాక్ట్ ఉద్యోగుల కొనసాగింపు ఉత్తర్వులు రాకపోవడం,పెండింగ్ బిల్లుల చెల్లింపులో ఆలస్యం కావడం ఇంకా ఇలాంటి అనేక రకాల సమస్యల పరిష్కారానికి, ఆయా విషయాల గురించి తమ ఉన్నతాధికారులకు విన్నవించుకొనే అవకాశం లేని పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పి శ్రీనివాస్, శ్రీలత, రమేష్, గణేష్, వాసంతి, జ్యోతి, సంగీత, ప్రసన్న, సుశీల, శారద, మాలిక్, నాగవర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని పంచాయతీ కార్యదర్శి

### ఇలా వచ్చి, అలా వెళ్తున్నారు...

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** ప్రజలకు నిరంతరం సేవలు అందిచాల్సిన పంచాయతీ కార్యదర్శి సకాలంలో విధులకు హాజరుకాకపోవడంతో అక్కడ ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని అక్కడ ప్రజలు అంటున్నారు. మండలంలోని యతిరాజపురం తండా గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎప్పుడు విధుల్లోకి వస్తారో...? ఎప్పుడు వెళ్తారో...? తెలియని పరిస్థితి ఆ గ్రామంలో నెలకొంది. ఏదైనా అవసరాలనిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలకు తాళాలు వేసిన తలుపులు దర్శనమిస్తున్నాయని అక్కడ ప్రజలు అం టున్నారు. తమ సమస్యలు ఎవరికి విన్నవించుకోవా లో తెలియని అయోమయ పరిస్థితిలో గ్రామ ప్రజలు సతమతమవుతున్నారు. ఏదో నామమాత్రంగా విధులు నిర్వహిస్తున్నట్లు వీరు తీరు చూస్తే అర్థమవుతుంది.




ఉదయం 9గంటల నుంచి సా యంత్రం నాలుగు గంటల వరకు గ్రామంలో అందుబాటులో ఉండాలి, కోన్ని ప్రత్యేక పరిస్థితుల్లో 24గంటల పాటు గ్రామస్తులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలి కాని ఇక్కడ అధికారి మాత్రం సమయపాలన పాటించడం లేదు. మండలానికి చివరన ఉన్న గ్రామ పంచాయతీ అయ్యి ఉండటం వల్ల ఒంటిపూటకు ఇంటి బాట పడుతున్నారని ప్రజలు అందుబాటులో ఉండటం లేదని ఇక్కడ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సక్కుబాయికి నివాళులు

**ప్రజాపక్షం/చివ్వెంల :** భారతీయ జనతా పార్టీ మండల నాయకులు పాచ్యనాయక్ తండ గ్రామానికి చెందిన ధరావత్ రవి నాయక్ తల్లి ధరావత్ సక్కుబాయి ఇటీవల అనారోగ్యంతో మరణించగా శుక్రవారం వారి దశదినకర్మకు మాజీ శాసనసభ్యులు, బిజెపి రాష్ట్ర నాయకులు సంకినేని వెంకటేశ్వరరావు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులను, కార్యకర్తలను పార్టీ ఒక కుటుంబంగా చూసుకుంటుందని, పార్టీ కోసం పనిచేసే



వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మాధవరపు అనిల్ రావు, సంధ్యాల సైదులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పేర్వాల లక్ష్మణరావు, నాయకులు రమావత్ మంగ్త నాయక్, జంపాల వెంకన్న, వీరన్న నాయక్, పగిళ్ల జానీ పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** తుంగతుర్తి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని తుంగతుర్తి, నాగారం, జాజిరెడ్డిగూడెం, తిరుమలగిరి, మద్దిరాల మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రాజెక్టు సిడిపిఓ శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. తుంగతుర్తి మండలంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులు గానుగుబండ (జనరల్), రావులపల్లి (ఎస్‌సి2), మొండికుంట తండ, రామన్నగూడెం తండ, దేవుని గుట్ట తండ, రాజన్నగూడెం తండ, మానాపురం అంగన్‌వాడీ ఆయా పోస్టులకు ఎస్‌టిగా రిజర్వేషన్ చేసినట్లు పేర్కొన్నారు. నాగారం మండలంలో వర్ధమానుకోట అంగన్‌వాడీ టీచర్ (హియరింగ్ హ్యాండ్ క్యాపుడు), హరిచంద్ తండ అంగన్‌వాడీ ఆయా పోస్టు ఎస్‌టి, జాజిరెడ్డిగూడెం మండలంలో రామన్నగూడెం టీచర్ (ఎస్‌టి), జాజిరెడ్డిగూడెం టీచర్ (బిసిఏ), లచ్చిరాం తండ టీచర్ (ఎస్‌టి), సూర్య తండ టీచర్ (ఎస్‌టి), రామన్నగూడెం, సూర్యనాయక్ తండ ఆయా (ఎస్‌టి), తిరుమలగిరి మండలంలో బండ్లపల్లి టీచర్ (జనరల్), భూక్య తండ, సాలెగూడెం తండ, సౌమ్య తండ, జేత్య తండ, శ్రీరామ్ తండ, కోటియా తండలలో ఆయా పోస్టులు ఎస్‌టి రిజర్వేషన్ కేటాయించడం జరిగిందని తెలిపారు. మద్దిరాల మండలంలో బయాన్‌తండ, ఆంగోత్ తండ, లాఖ్యాతండ, మేడిబాయి తండలలో ఆయా పోస్టులకు ఎస్‌టి రిజర్వేషన్ కేటాయించారు. సంబంధిత పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థులు జూలై 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## చందుపట్ల పిఎసిఎస్ చైర్మన్‌గా సతీష్ పవన్ బాధ్యతలు స్వీకారణ



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** చందుపట్ల పిఎసిఎస్ సంఘంమునకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు G.O Rt.No:381 తేది:06072026 ప్రకారం నాన్ అఫిషియ ల్ పర్సన్ ఇంచార్డ్ కమిటీ నియమించగా సంఘంలో పాలక వర్గం పదవి బాధ్యతలు స్వీకరించినారు. ఈ మేరకు చందుపట్ల పిఎసిఎస్ చైర్మన్‌గా సతీష్ పవన్, సంఘం సభ్యులుగా చిన్నం ఉప్పలయ్య, మాటూరి నవనీత, నల్ల భక్తమ్మ, సుర్వీ కృష్ణ, సిలివేరు నరేష్, పాక వెంకటేశం, నల్ల మాచు శివరాజు, అంగడి బుచ్చయ్య, సురుపంగ రవి, పెద్దిటి సుమీలమ్మ, వద్దే నరేష్, దంతూరు సత్తయ్యలతో యాదాద్రి భువనగిరి జిల్లా సహకార శాఖ అధికారి కే.నాగార్జున ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపాలిటీ చైర్మన్ తంగెళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్, భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ కానుకుంట్ల రేఖబాబురావు, PACS భువనగిరి ఫకీరు కొండల్ రెడ్డి, AMC డైరెక్టర్ చిన్నం శ్రీనివాస్, భువనగిరి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లంల జంగయ్య యాదవ్, మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, నరాల వెంకట్ స్వామి, సంఘం పరిధిలోని ఎనిమిది గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సంఘం సీఈఓ నల్లమాస రాములు, సిబ్బంది సంఘ రైతు సభ్యులు పాల్గొన్నారు.

## మండల విద్యాశాఖాధికారిగా తంగెళ్ల సురేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల విద్యాశాఖాధికారిగా వెల్లంకి జిల్లా ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిలు తంగళ్ల సుఖేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ అంకితభావంతో పని చేయాలని, విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ప్రతి జిల్లా ఉన్నత పాఠశాలలో 100 శాతం ఫలితాలు సాధించి జిల్లాలో రామన్నపేట మండలం అగ్రస్థానంలో నిలవాలని కోరారు. ఈ సందర్భమును పురస్కరించుకొని వివిధ సంఘాల నాయకులు, ప్రైవేట్ పాఠశాల యాజమాన్యులు, జిహెచ్‌ఎంలు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు కె శేఖర్, డి . స్వామి, శేషాచారి,పి ఆర్ టి యు మండల సెక్రటరీ రవం,జవీందర్ రెడ్డి,రాజు బాబు,విష్ణువర్ధన్ రెడ్డి, పి ఈ టి లతో పాటు మండల పి . మరి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ సద్వినియోగం

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను తండా ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని మండల పరిధిలోని దంజిలాల్ తండా సర్పంచ్ రమావత్ రామునాయక్ అన్నారు. తండాలో జరుగుతున్న సర్ ప్రక్రియలో ఆయన బిఎల్‌వోతో పాటు ఇంటింటికి వెళ్ళి ఎన్యూమరేషన్ ఫారాలు నింపడంలో ప్రజలకు సహకరించారు. ఈకార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ దశరథ్, బిఎల్‌వో అనిత, వార్డు సభ్యులు కృష్ణ, రాజు, అనిత, లలిత, కృష్ణ, బావోజీ గణేష్, తావుర్య పాల్గొన్నారు.

# బిఎల్‌ఒకు అందించాలి

**ప్రజాపక్షం/త్రిపురారం:** మండలంలో ప్రతి గ్రామంలో ఉన్న 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఎస్ఐఆర్ సర్వేకు సహకరించాలని మాజీ ట్రై కార్ చైర్మన్ ఇస్లావత్ రామచంద్రనాయక్ అన్నారు. శనివారం మండలంలోని ఆయన స్వగ్రామైన సత్యం పాడు తండాలో బిఎల్‌ఓ కు ఫామ్ ను ఆయన అందజేశారు.

# ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** ప్రభుత్వ పాఠశాలను కాపాడాలనే సంకల్పంతో మండలంలోని నాగుల పహాడ్ గ్రామ పంచాయితీ శుక్రవారం వినూత్న నిర్ణయం తీసుకుంది. గ్రామంలో జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పిల్లలను చేర్పించే కుటుంబాలకు ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలను ప్రకటిస్తూ గ్రామ సర్పంచ్ నిరంజన్ రెడ్డి ముందుకొచ్చారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పిల్లలను చేర్పించే ప్రతి కుటుంబానికి ప్రభుత్వ రేషన్‌కు అదనంగా నెలకు 25 కిలోల బియ్యం, ఒక రైస్ కుక్కర్, విద్యార్థులకు అవసరమైన స్కూల్ బ్యాగులు, నోటు బుక్స్, ఇతర విద్యా సామాగ్రి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాయి రమేష్, వార్డు సభ్యులు కొండ గోవర్ధన్, మామిడి జానమ్మ, కందుకూరి నరేష్, గోలి చిన లింగయ్య, మీసాల జ్యోతి, ఒగ్గు రేణుక, కందుకూరి బక్కమ్మతోపాటు గ్రామ పంచాయితీ పాలకవర్గ సభ్యులు పాల్గొని తమ మద్ధతు ప్రకటించారు.

# సన్మానం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహాత్మా గాంధీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ హరీష్ కుమార్ నియమితులైన సందర్భంగా శుక్రవారం కళాశాల బోధనేతర సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎ.వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ హరీష్ కుమార్‌కు అభినందనలు తెలియజేశారు.బోధనేతర సిబ్బంది అందరం కలిసికట్టుగా శ్రమిస్తూ కళాశాల సమగ్ర అభివృద్ధికి ఎల్లప్పుడూ తోడ్పాటు అందిస్తామని పేర్కొన్నారు.ఈ సన్మాన కార్యక్రమంలోబోధనేతర సిబ్బంది ఐతరాజు శంకర్,సత్యనారాయణ,ధనలక్ష్మి పాల్గొన్నారు.

# 11న సంతాప సభ

**ప్రజాపక్షం/మోతె :** అరుణోదయ సాంస్కృతిక దళపతి సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు అరుణోదయ నాగన్న సంతాప సభను జయప్రదం చేయాలని ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు కునుకుంట్ల సైదులు కోరారు. శుక్రవారం మండలంలోని రావిపహాడ్ గ్రామంలో సంతాప సభ కరపత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఈనెల 11న సూర్యాపేటలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించు సభకు కవులు, కళాకారులు, మేధావులు, కార్మికులు, కర్షకులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు కోట మధుసూదన్ రెడ్డి, కాకి మోహన్ రెడ్డి, లింగయ్య పాల్గొన్నారు.

# శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** ఉపాధ్యాయులందరూ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని విద్యాబోధనలో డిజిటల్ లిటరసీ, ఏఐ వంటి వాటిని సమ్మేళితం చేసి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ ద్వారా సమర్థవంతమైన బోధన అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఆదర్శ పాఠశాల ఇమాంపేట నందు భౌతిక శాస్త్ర, హిందీ ఉపాధ్యాయులకు ఎస్‌సిఇఆర్‌టి వారిచే క్వాలిటి లెర్నింగ్ త్రూ ట్రాన్స్ఫర్‌మేటివ్ ప్రాక్టీసెస్ అనే థీమ్‌తో రూపొందించిన శిక్షణ శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలోని పాఠశాలలోని సమస్యలను ఉపాధ్యాయులు అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా తగిన కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. జాతీయస్థాయిలో నిర్వహించే పర్ఫామెన్స్ గ్రేడ్ ఇండెక్స్‌లో సూర్యాపేట 324/600 పాయింట్లతో ప్రచేష్ట1 స్థాయిని పొంది రాష్ట్రంలో 17వ స్థానంలో నిలిచిందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో మొదటి వరుస స్థానంలో నిలిచే విధంగా ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిల ఆధారంగా ప్రతి ఉపాధ్యాయుడు తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి ఏలే హరికృష్ణ, భౌతిక శాస్త్ర, హిందీ జిల్లా రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో దళితులకు అన్యాయం



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను పట్టించుకోవడంలేదని,దళితులకు అన్యాయం జరుగుతుందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మిరి శెట్టి నరసింహులు అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భువనగిరిలో బిసి విజయభేరి సభను ప్రజలు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అన్నారు. అధికార పార్టీ వారు ఎన్ని అడ్డంకులు చేసినా ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు సభకు వచ్చి విజయవంతం చేశారని అన్నారు. ఆలేరు నియోజకవర్గంలో ఏడు పిఎసిఎస్ చైర్మన్ లను ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ద్వారా ఎన్నుకోవాలి కానీ కాంగ్రెస్ ప్రభుత్వం దొడ్డిదారి రాజకీయాలు చేసి ఎన్నుకున్నారని అన్నారు. ఒక్క ఎస్సికి కూడా పిఎసిఎస్ చైర్మన్ పదవి ఇవ్వలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోత్కుపల్లి రఘు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొంగల కిష్టయ్య, మండల రైతు విభాగం అధ్యక్షుడు గుండెబోయిన కృష్ణమూర్తి, మండల అధ్యక్షుడు గోనె కృష్ణ, మండల యూత్ కార్యదర్శి రావుల రాజు, మాజీ సర్పంచ్ బోళ్ల ప్రకాష్ పాల్గొన్నారు.

# బిసి గురుకులాల్లో అతిథి అధ్యాపకుల నియామకం

**జూలై 11 నుంచి దరఖాస్తుల స్వీకరణ**

**ప్రజాపక్షం/నందికొండ :** ఎంజెపిటిబిసి వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాల,కళాశాలల్లో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి స్వప్న తెలిపారు. కేవలం మహిళా అభ్యర్థుల కోసం జూనియర్ లెక్చరర్ ఇంగ్లీష్,ఎకనామిక్స్‌తో పాటు పీజీటీ ఇంగ్లీష్,సోషల్ స్టడీస్ పోస్టులను భర్తీ చేయనున్నారు.పీజీటీ హిందీ, మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్, జూనియర్ లెక్చరర్ ఫిజిక్స్,కెమిస్ట్రీ,బోటనీ పోస్టులకు పురుషులు,మహిళలు ఇద్దరూ దరఖాస్తు చేసుకోవచ్చు.సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ తో పాటు బి.ఎడ్. అర్హత,పీజీలో కనీసం 55 శాతం మార్కులు ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తులను జూలై 11 నుంచి 14 వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నల్లగొండలోని మిర్యాలగూడ రోడ్,ఏచూరి గార్డెన్స్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఉన్న బీసీ సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల (కనగల్)లో సమర్పించాలి.అర్హులైన అభ్యర్థులకు జూలై 16 ఉదయం 9 గంటల నుంచి నల్లగొండ మునుగోడు రోడ్డులోని ఎంజెపిటిబిసిగురుకుల బాలికల పాఠశాల (అప్పాజిపే),రాఘవేంద్ర బిఎడ్ కళాశాలలో సబ్జెక్టుల వారీగా డెమో,ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి స్వప్న తెలిపారు.మరిన్ని వివరాలకు: 08682 224566,7993456805

# పిఎసిఎస్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పీ ఏ సీఎస్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హాజరై నూతనంగా నియమితులైన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా తుర్కపల్లి మండల కేంద్రం నుంచి పిఏసీఎస్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రజాప్రతినిధులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని నూతన పాలకవర్గానికి ఘన స్వాగతం పలికారు.అనంతరం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తుర్కపల్లి పి ఏ సి ఎస్ చైర్మన్గా ధరావత్ శంకర్ నాయక్ తో పాటు నూతన పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, సహకార సంఘాలు రైతుల ఆర్థికాభివృద్ధికి కీలకమైన సంస్థలని అన్నారు. రైతులకు అవసరమైన రుణాలు, ఎరువులు, విత్తనాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించి సంఘాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని నూతన పాలకవర్గానికి సూచించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ డైరెక్టర్లు,జాగిల్లపురం సత్యనారాయణ,హన్మంత్ నాయక్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,



# నీటి పొదుపుతో...బంగారు భవిష్యత్తు!

**ప్రజాపక్షం/హాలియా:** నీటి పొదుపును ప్రతి ఒక్కరూ అలవర్చుకుంటే భవిష్యత్తు బంగారు బాటగా మారుతుందని మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి అన్నారు.శుక్రవారం జలసంచై జన్ భాగీదారిశ కార్యక్రమంలో భాగంగా జల సంరక్షణ పై ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు మనిషికి జీవనాధారం అని ప్రతి ఒక్కరూ వర్షపునీటిని ఒడిసి పట్టుకుంటే భవిష్యత్తు తరాలకు బంగారు బాటగా మారుతుంద న్నారు. ప్రతి ఒక్కరూ నీటి వృధానే అరికట్టి వర్షపు నీటి సంరక్షణ పై దృష్టి సారించి దానిని పొదుపు చేయాలని సూచించారు. నీటి కుళాయిల లీకేజీలను తక్షణమే మరమ్మతు చేసి నీటిని సంరక్షించాలని కోరారు. ప్రతి వర్షం నీటి చుక్కను సేకరించి రైన్ వాటర్ హార్వెస్టింగ్ పద్ధతులను అమలు చేయాలని ప్రతిజ్ఞ చేయించారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజకు నాణ్యమైన సేవలు



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ ధరలలో నాణ్యమైన వైద్య సేవలను అందించాలని దేవరకొండ మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నల్గొండ రోడ్డులో శ్రీ సాయి మానస ఫస్ట్ ఎయిడ్ సెంటర్, శ్రీ పద్మ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్‌ను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆలంపల్లి నర్సింహా మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని అన్నారు. సిఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్, ప్రజా ప్రతినిధులను ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకుడు, ఆర్ఎంపి వైద్యుడు బొడ్డుపల్లి ముత్యాలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్ర మంలో సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డుపల్లి సైదులు, ఊట్కూరి వేమన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కుంభం శ్రీనివాస్‌గౌడ్, బోడ యాదయ్య పాల్గొన్నారు.

# ఆరోగ్య అలవాట్లను అలవర్చుకోవాలి



**ప్రజాపక్షం/హాలియా:** విద్యార్థులు ఆరోగ్యం పై అవగాహన కలిగి ఉండి మంచి అలవాట్లను అలవర్చుకోవాలని జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు అన్నారు.శుక్రవారం హాలియాలోని బిసి,ఎస్సి, ఎస్టి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం,బాలుర,బాలికల సంక్షేమ వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు.ఈసందర్భంగా విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు.సంక్షేమ వసతి గృహాలలో ఎటువంటి మెనూ అందిస్తున్నారు, మెనూలో సమస్యలు,ఇబ్బందులు ఏవైనా ఉన్నాయా? మెను ఎలా ఉంది అంటూ తదితర అంశాలను విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలన్నారు.వసతి గృహాలలో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వచ్చి వాటిని పరిష్కరించుకోవాలని విద్యార్థులకు సూచించారు.

# హుజూర్‌నగర్ ఎస్ఐ2గా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ హనుమనాయక్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ ఎస్ఐ2గా ఎస్ఐ హనుమనాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం చిలుకూరు ఎస్ఐగా విధులు నిర్వహించి బదిలీపై హుజూర్‌నగర్‌కు రావడంతో హుజూర్‌నగర్ సిఐ చరమందరాజు మర్యాదపుర్వకంగా కలిసి పుష్పగుచ్చం ఇచ్చి అనంతరం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు.

# రేషన్ డీలర్ల దరఖాస్తుకు నోటిఫికేషన్

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : పోచంపల్లి మండల వ్యాప్తంగా ఉన్న వివిధ గ్రామాలలో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాల డీలర్లను భర్తీ చేసేందుకు రిజర్వేషన్ వారిగా అర్హులైన వారి నుంచి దరఖాస్తుకు 9న నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పోచంపల్లి తహసిల్దారు శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం తెలిపారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 30 ఖాళీలు ఉండగా గ్రామాల వారీగా ఖాళీల వివరాలను తాసిల్దార్ ఆఫీస్ నోటీస్ బోర్డులో ప్రదర్శించారు. దరఖాస్తుదారులు రిజర్వేషన్ కేటాయిం చిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారు లు 10వ తరగతి కనీస అర్హత. సంబంధిత పూర్తి సర్టిఫికెట్లతో 13వ తేదీ నుండి దరఖాస్తుల స్వీకరిస్తారు. దరఖాస్తు చేసేందుకు చివరి తేదీ ఈ నెల 27. రాత పరీక్ష ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక. పూర్తి సమాచారం కోసం తాసిల్దార్ ఆఫీస్ లో సంప్రదించాలని పేర్కొన్నారు. జూలూరు, కప్రాయి పల్లి, పెద్దగూడెం ధర్మారెడ్డి పల్లి అంతమ్మ గూడెం, దేశ్ముఖి, పెద్ద రావులపల్లి, శివారెడ్డి గూడెం ఇంద్రియాల జిబ్లక్ పల్లి దంతూరులో ఖాళీలు ఉన్నాయి.

# ప్రతి ఓటు విలువైనది

**ప్రజాపక్షం/రామన్నపేట** : ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని ఏ ఒక్కరి ఓటు కూడా మిస్ కాకుండా చూసే బాధ్యత మన అందరిపై ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకట రాజిరెడ్డి తెలిపారు. రామన్నపేట మండలంలో జరుగుతున్న సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకటరాజిరెడ్డి మండల ప్రజలకు సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ చేపడుతున్న సర్ కార్యక్రమం ప్రతి ఓటరు హక్కును కాపాడేందుకు ఉద్దేశించినది. మండలంలోని ప్రతి కుటుంబం తమ పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని తెలిపారు.

# కాంగ్రెస్ ఒంటెద్దు పోకడ సరికాదు

**ప్రజాపక్షం/తుర్కపల్లి** ః మిత్రపక్షాలను, ప్రతిపక్షాలను కలుపుకొని పోకుండా ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఒంటెద్దు పోకడ పోతున్నారని, రానున్న రోజుల్లో ఇలాంటి ఒంటెద్దు పోకడ పార్టీలను, నాయకులను ప్రజలు ఉపేక్షించరని తుర్కపల్లి సీపీఐ మండల కార్యదర్శి సిలివేరు దుర్గయ్య విమర్శించారు. తుర్కపల్లి మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన పిఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారానికి విచ్చేసిన ఆలేరు ఎమ్మెల్యే ను సీపీఐ మండల కార్యదర్శి ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీతో మిత్రపక్షంగా ఉన్న సీపీఐ, ఇతర ప్రతిపక్షాల అభిప్రాయాలను సంప్రదించ కుండా, ఎలాంటి ఎన్నికలకు పోకుండా దొడ్డిదారిన నామినేట్ పదవులు కట్టబెట్టి,ప్రమాణస్వీకారం తంతు ముగించారని, ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా,రైతుల అభీష్టానికి ప్రాధాన్యత ఇవ్వడం లేదని,ఆయన మండిపడ్డారు. ఏ పార్టీ ఐనా ప్రజాభీష్టం మేరకు పనిచేయాలని హితవుపలికారు.

# కళా ప్రదర్శన

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్** : సాంస్కృతిక సారధి కళాకారులు చైతన్య వారదులుగా ఓటు హక్కు ప్రాధాన్యత సర్ కార్యక్రమంలో భాగంగా ఓటుకు అందరు దరఖాస్తు చేసుకోవాలని కళా ప్రదర్శనలతో ప్రజలను చైతన్య పరుస్తున్నారు.శుక్రవారం మండలంలోని బోయ గూడెంలో గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంగూరి సురేష్, పంచాయితీ కార్యదర్శి స్వాతి,ఉపసర్పంచ్ గురువయ్య,గ్రామస్తులు పద్మ,జయమ్మ,వెంకట్ రెడ్డి,కోటమ్మ, మహేందర్,అలివేలు, సారధి కళాకారులు బందెల మల్లిక,నాగిళ్ళ కొండల్ తదితరులు ఉన్నారు.



# పేదల సొంతింటి కల సాకారం..



**ప్రజాపక్షం/నకిరేకల్** : పేద ప్రజలకు గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.నకిరేకల్ మండలం గోరెంకలపల్లి గ్రామానికి చెందిన జాజుల శైలజముత్తయ్య దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

**శ్రీ కృష్ణా నర్సింగ్ హోమ్‌లో స్కానింగ్ మిషన్ ప్రారంభం** : పట్టణంలోని శ్రీ కృష్ణా నర్సింగ్ హోమ్ లోనూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక స్కానింగ్ మిషన్‌ను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శుక్రవారం ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి రావడంతో స్థానిక ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువ అవుతాయని అన్నారు.చిన్నచిన్న పరీక్షల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నకిరేకల్ లోనే అత్యాధునిక స్కానింగ్ సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ గౌతమ్ రెడ్డి,డాక్టర్ సుష్మ,పిఎసిఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు నాయకులు గాదగోని కొండయ్య, లింగాల వెంకన్న, పన్నాల రాఘవరెడ్డి,చౌగోని శ్రీనివాస్,మురారి శెట్టి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# అఖిలపక్ష బంద్ విజయవంతం



**ప్రజాపక్షం/నార్కెట్‌పల్లి** : పట్టణంలో రోడ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ శుక్రవారం విజయవంతమైంది.పట్టణంలోని ప్రధాన వ్యాపార ప్రాంతాల్లో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి బంద్‌కు మద్దతు తెలపగా, ప్రజలు కూడా సహకరించారు.అనంతరం బస్స్టాండ్ సమీపంలో జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు.జేఏసీ కన్వీనర్ చిరుమర్తి యాదయ్య అధ్యక్షతన జరిగిన ధర్నాలో పలువురు నాయకులు మాట్లాడుతూ నార్కెట్‌పల్లి పట్టణంలో అసంపూర్తిగా ఉన్న రోడ్ల నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రోడ్ల దుస్థితి కారణంగా ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్,వెంపటి శ్రీనివాస్,సిపిఎం మండల కార్యదర్శి చింతపల్లి బయన్న, ఎస్ఆర్ వెంకటేశ్వర్లు,మేడబోయిన శ్రీనివాస్,నోముల నాగరాజు,లింగాల యాదయ్య, చింత లక్ష్మణ్, చెరుకుపల్లి రామలింగం,మరిది శివకృష్ణతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు,ప్రజాసంఘాల ప్రతినిధులు,వ్యాపారులు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాను ఎడారిగా మార్చే కుట్ర



**ప్రజాపక్షం/నకిరేకల్** :ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకుండా సాగునీటి నిర్వహణలో విఫలమవడంతో నల్లగొండ జిల్లాను ఎడారిగా మార్చే పరిస్థితులు నెలకొన్నాయని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు.శుక్రవారం పట్టణంలోని సువర్ణ ఫంక్షన్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు వ్యవసాయ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతాంగానికి సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.నల్లగొండ,నకిరేకల్, మిర్యాలగూడ,నాగార్జునసాగర్ ప్రాంతాలకు సాగునీరు అందించే ఏఎంఆర్పీ కాలువకు నీటిని విడుదల చేయకపోవడంతో చెరువులు,కుంటలు ఎండిపోయి భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మెప్పు కోసమే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నాగార్జునసాగర్ నుంచి నీటిని తరలిస్తున్నా స్పందించడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్ రెడ్డి,మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్,మాజీ జెడ్పిటీసీ తరాల బలరాం,పార్టీ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు,మండల ఉపాధ్యక్షుడు గుండగోని జంగయ్య గౌడ్, యూత్ మండల అధ్యక్షుడు పేర్ల కృష్ణకాంత్, నాయకులు పెండెం సదానందం, రాచకొండ వెంకన్న, రావిరాల మల్లయ్య, పల్లె విజయ్,సైదిరెడ్డి,అఖిల్ గుర్రం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# 3 కాంస్య పతకాలు సాధించిన షకీర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్**: హైదరాబాద్ మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈనెల 7 నుంచి 9 వరకు నిర్వహించిన 5వ తెలంగాణ రాష్ట్ర పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2026లో జిల్లా పోలీసు కార్యాలయం పాలనా విభాగంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ షకీర్ మూడు కాంస్య పతకాలు సాధించారు.ఈ విశిష్ట విజయాన్ని గుర్తించి శుక్రవారం నల్లగొండ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ షకీర్‌ను సన్మానించి అభినందించి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్రీడల్లో షకీర్ బాడీ బిల్డింగ్,జూడో,రెజ్లింగ్ విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబర్చి మూడు కాంస్య పతకాలు సాధించి నల్లగొండ జిల్లా పోలీసు శాఖకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని అన్నారు. విధులను సమర్థంగా నిర్వహిస్తూనే క్రీడల్లో రాణించడం గర్వకారణమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఓ శివ ప్రసాద్,సూపర్డెంట్లు శ్రీకాంత్,షబ్బీర్,విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.



# హోంగార్డు వెంకటాచారికి సన్మానం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : హోంగార్డు వెంకటాచారి మూడు దశాబ్దాల సుదీర్ఘ సేవా కాలంలో నిజాయితీ,క్రమశిక్షణ,అంకితభావంతో విధులు నిర్వహించి పోలీస్ శాఖలో అందరి మన్ననలు పొందారని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ వారి సేవలను కొనియాడారు.శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శాలువా కప్పి,పూలమాల వేసి ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేసి కుటుంబ సభ్యులను కూడా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వెంకటాచారి జిల్లా పోలీస్ శాఖలో హోంగార్డుగా సుమారు 30 సంవత్సరాల పాటు అంకితభావంతో సేవలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సంతోష్,జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు,సిబ్బంది,హోంగార్డులు,వెంకటాచారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కొలువుదీరిన నూతన పిఎసిఎస్ పాలకవర్గం



**ప్రజాపక్షం/బొమ్మలరామారం** ః బొమ్మలరామారం మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పిఎసిఎస్ నూతన పాలకవర్గం శుక్రవారం రోజున ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగాపురం చౌరస్తా నుండి పి ఎస్ సి ఎస్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బొమ్మలరామారం మండలం పిఎసిఎస్ చైర్మన్ గా సింగిర్తి మల్లేశం, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సహకార సంఘాల రైతుల అధిక అభివృద్ధికి కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చీర సత్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్ పైలెట్, మహిళా అధ్యక్షురాలు కళ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు సంగీత, కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన ఉపాధ్యక్షుడు నందరాజు గౌడ్, రాజు నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు మండల నాయకులు జిల్లా నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామ శాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# 2026-27 యాక్షన్ ప్లాన్ రిజిస్ట్రేషన్ డ్రైవ్ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :మేరా యువ భారత్ జిల్లా సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు.శుక్రవారం కలెక్టరేట్‌లో డివైఎస్ఓ అక్బర్ అలీ అధ్యక్షతన జిల్లా అడ్వైజర్ కమిటీ,జిల్లా సమన్వయ కమిటీ, 202627 యాక్షన్ ప్లాన్‌పై సమావేశం నిర్వహించారు.గత సంవత్సరం జరిగిన కార్యక్రమాలు,ప్రస్తుతం నిర్వహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.ఈసందర్భంగామై భారత్ ఇన్టెన్సివ్ రిజిస్ట్రేషన్ డ్రైవ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్ ద్వారా జిల్లా యువత అధిక సంఖ్యలో పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా యూత్ ఆఫీసర్ గౌతమ్ రెడ్డి,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి,అకౌంట్స్ ప్రోగ్రాం అసిస్టెంట్ భాను చందర్,జిల్లా ఇంటర్మీడియట్ అధికారి,దస్రు నాయక్,కళాశాల ప్రిన్సిపల్స్ ఘనశ్యాం,పద్మ,ఉపేందర్,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి,కరుణాకర్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, యూత్ వాలంటీర్లు పాల్గొన్నారు.





## సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** సంక్షేమ హాస్టల్ నెలకొని ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఒంటెపాక కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్సి బలికల హాస్టల్ లో సర్వే నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులు కనీస వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తమ సర్వేలో వెల్లడయ్యిందన్నారు.విద్యా సంవత్సరం ప్రారంభమై నెల గడుస్తున్నా నేటికీ విద్యార్థులకు నోటుబుక్స్, దుస్తులు, ట్రంకు పెట్టెలు అందించలేదన్నారు. హాస్టల్లో ఫ్యాన్ లేక విద్యార్థులు ఉక్కపోతతో ఉండాల్సి వస్తుందన్నారు. లేని పక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు వంగూరి వెంకన్న,వి నాగార్జున,సైదులు, బక్కయ్య, జమదగ్నిపాల్గొన్నారు.

## ఎర్రజెండాలు,తోరణాలతో ముస్తాబైన నకిరేకల్



**ప్రజాపక్షం/నకిరేకల్ :**సీఐటీయూ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు నకిరేకల్ సిద్ధమైంది. శని,ఆదివారాల్లో పట్టణంలోని కేఆర్ ఆడిటోరియంలో నిర్వహించే రెండు రోజుల శిక్షణ శిబిరానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర నాయకులు హాజరై కార్మిక హక్కులు, ఉద్యమాల నిర్వహణ, సమకాలీన రాజకీయ అంశాలపై మార్గనిర్దేశం చేయనున్నారు. ఈ సందర్భంగా పట్టణాన్ని ఎర్రజెండాలు,తోరణాలు స్వాగత బ్యానర్లతో అలంకరించారు. ఈ శిక్షణతో కార్మిక ఉద్యమాలకు మరింత బలం చేకూరుతుందని నాయకులు తెలిపారు.ఏర్పాట్లను సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు,లకపక రాజు,జిల్లా సహాయ కార్యదర్శి పెంజర్ల సైదులు,జిల్లా కమిటీ సభ్యులు వంటేపాక వెంకటేశ్వర్లు, ఆదిమల్ల సుధీర్ పరిశీలించారు.

## ఓటర్ల సమగ్ర సవరణపై అవగాహన

**ప్రజాపక్షం/నాంపల్లి :** ఎస్ఐఆర్ ప్రక్రియపై లింగోటం ఎంపిటిసి పరిధిలోని చిట్టంపహడ్,వడ్డేపల్లి,స్వాముల వారి లింగోటం గ్రామాలలో జరుగుతున్న ఓటర్ల సమగ్ర సవరణ పై అవగాహన కల్పిస్తూ ఎంపిటిసి పరిధి ఇన్చార్జి బాషిపాక రామన్న మాట్లాడారు. ఎస్ఐఆర్ అనే కార్యక్రమం ప్రతి 20 ఏళ్లకు ఒకసారి జరిగే కార్యక్రమం అని దేశంలోని అన్ని రాష్ట్రాలలో విడతలవారీగా చేపడుతున్న ఈకార్యక్రమం ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతుందని తెలిపారు. చిట్టంపహడ్ గ్రామంలో 950 ఓటర్లు ఉండగా 650,మంది తమ యనిమరేషన్ ఫామ్స్‌ను తిరిగి ఇవ్వగా వడ్డేపల్లి గ్రామంలో1237 గాను 900,అదేవిధంగా లింగోటం గ్రామంలో 1322 గాను 600 ఓటర్ల తమ ఎనిమరేషన్ ఫామ్స్ అందజేశారు. బిఎల్ఓలు యాదమ్మ,నవనీత, ధనమ్మ, బిఎల్‌ఏలు ఏడుకొండలు,కాశయ్య,శ్రీశైలం, వెంకటేశ్వర్లు, జనార్ధన్ పాల్గొన్నారు.

# పాఠశాలల బంద్ విజయవంతం





**ప్రజాపక్షం/మోటకొండూర్ :** ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని నియంత్రిస్తూ ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు అధిక ప్రాధాన్యత కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మోటకొండూరు మండల ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ కన్వీనర్లు ఆలేటి సాయికుమార్, గాదగాని మణికంఠలు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ పిలుపు మేరకు మోటకొండూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రైవేట్ పాఠశాలలను బంద్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు గాజుల నందు, బిస సాయి, వస్పరి శ్రీకాంత్, దూడల అరవింద్, లోకేష్, మారబోయిన భవాని, కొల్లూరు దీక్షిత, హర్షిని, గజరాజు అశ్విని, భేతి సహస్ర తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మునుగోడు :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రభుత్వ విద్యా విధానాలకు వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్,ఎస్ఎఫ్ఐ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ మునుగోడులో విజయవంతంగా ముగిసింది.అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఈ బంద్ నిర్వహించారు.అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి గోపగోని ఉదయ్,డివైఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి కట్ట లింగస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు బొల్గూరి వంశీ,శివర్ల నాగరాజు,బక్క కిరణ్,కంభంపాటి శివ,వరగంటి ధనుంజయ్,ఎస్ఎఫ్ఐ నాయకులు నారబోయిన పవన్,జిల్లపల్లి శివ,డివైఎఫ్ఐ నాయకులు పులకరం శివ,నరేష్,చింటూ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/డిండి;** తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ, విద్య రంగాభివృద్ధిని పూర్తిగా విస్మరిస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పతనం తప్పదని ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు సురిగి వినయ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం డిండి మండల కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ నిర్వహించిన రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్ పూర్తిగా విజయవంతం అయింది. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు సిద్దు, తరుణ్, విజయ్, భాస్కర్, శ్యాంసన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నాంపల్లి :** విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో శుక్రవారం ఏఐఎస్ఎఫ్,ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు సందీప్,శ్యామ్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ బంద్‌లో ఏఐఎస్ఎఫ్,ఎస్ఎఫ్ఐ నాయకులు సంతోష్,హరి,కృష్ణ,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నకిరేకల్ :**విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త



విద్యాసంస్థల బంద్ శుక్రవారం నకిరేకల్ నియోజకవర్గంలో విజయవంతమైంది. నకిరేకల్,కట్టంగూరు,కేతేపల్లి,శాలిగౌరారం మండలాల్లో ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు బంద్‌కు మద్దతు తెలిపాయి.ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకుడు నరేష్,ఎస్ఎఫ్ఐ నాయకులు సుజిత్,అజయ్,శివ,సంజయ్,సాయి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/వేములపల్లి:**విద్యారంగ సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాలు ఆధ్వర్యంలో శుక్రవారం బంధు ప్రశాంతంగా జరిగింది ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్ట సంపత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 47 వేల ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్న ప్రభుత్వ యూనిఫారం నోటు పుస్తకాలు ఇవ్వకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తూ వెంటనే విద్యార్థు




లకు రావాల్సిన అన్ని రకాల సదుపాయాలు అందించాలని డిమాండ్ చేశారు,ఈ కార్యక్రమంలో శివ రాము లోకేష్ మణి శాంతి,స్వాతి,శ్వేత పాల్గొన్నారు.




## ఓపెన్,టెన్త్ ఇంటర్ అడ్మిషన్లు

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే టెన్త్,ఇంటర్ లో హెచ్ ఈ సి, సి ఈ సి గ్రూపులలో ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తిరుమలగిరి సాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ కె .శ్రీనివాస్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ జార్జిలు తెలిపారు. తిరుమలగిరి ఉన్నత పాఠశాలలోని స్టడీ సెంటర్లో ఈనెల జూలై 28వ తేదీ వరకు అర్హత కలిగిన వారు అందరూ పదవ తరగతి,ఇంటర్మీడియట్ లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివిధ కారణాలతో చదువు మధ్యలో మానివేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.గత సంవత్సరం జరిగిన ఓపెన్ టెన్త్ ,ఇంటర్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని గుర్తు చేశారు.ఇతర వివరాలకు 6300016466 నెంబరు సంప్రదించాలని కోరారు.



## చేనేత సంఘం నూతన కమిటీని సత్కరించిన ప్రభుత్వ విప్

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** మండలంలోని ఏపీ లింగోటం గ్రామంలోని చేనేత సహకార సంఘం నూతన కమిటీ ఎన్నికైంది.సంఘం అధ్యక్షుడిగా గంజి రమేష్,కార్యదర్శిగా రుద్ర శ్రీను ఎన్నికయ్యారు.డైరెక్టర్లుగా బేత వెంకన్న,రుద్ర సత్యనారాయణ తదితరులు ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన కమిటీని ప్రభుత్వ విప్,నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం శాలువాలతో ఘనంగా సత్కరించి మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని,చేనేత కార్మికులు,సభ్యుల సంక్షేమానికి కృషి చేయాలని నూతన కమిటీకి సూచించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సటు సత్తయ్య,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చెరుకు నాగరాజు,జిల్లా కాంగ్రెస్ నాయకులు గడ్డం పశుపతి,మాజీ సర్పంచ్ నూకల శంకర్,బైరెడ్డి రాంగోపాల్ రెడ్డి,మెడబోయిన ఐలయ్య,ఉగ్గపల్లి ఆంజనేయులు,గంజి శ్రీను,సంఘ సభ్యులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు డైరీలు పంపిణీ



**ప్రజాపక్షం/నకిరేకల్ :**ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల్లో చదువుపై క్రమశిక్షణ,హోంవర్క్ నిర్వహణకు ప్రోత్సాహం కల్పించేలా పీఆర్టీయూ టీఎస్ కట్టంగూర్ మండల శాఖ ఆధ్వర్యంలో 1,100 మంది విద్యార్థులకు డైరీలను పంపిణీ చేశారు.కట్టంగూర్ మండలంలోని చెరువు అన్నారం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వారం నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాధికారి అంబటి అంజయ్య డైరీలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో జడ్‌పిహెచ్‌ఎస్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్ రెడ్డి,ప్రాథమిక పాఠశాలప్రధానోపాధ్యాయుడు గణపురం భీమయ్య,యూపీఎస్ ఎర్రసానిగూడెం ప్రధానోపాధ్యాయుడు చింత యాదగిరి, చింతకాయల పుల్లయ్య, సమ్మెటి తిరుమలేష్,తడకమళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎరువుల పంపిణీలో పారదర్శకత

**ప్రజాపక్షం/నకిరేకల్:** రైతులకు యూరియా సకాలంలో, పారదర్శకంగా అందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌తో పాటు మీసేవ కేంద్రాల ద్వారా బుకింగ్ సదుపాయం అందుబాటులోకి వచ్చిందని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం నకిరేకల్ పట్టణంలోని ఓ ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఆయన సందర్శించి, యూరియా బుకింగ్,పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాప్ ద్వారా బుకింగ్ చేయడం వల్ల రైతులు ఎరువుల కోసం దుకాణాల వద్ద గంటల తరబడి క్యూల్లో నిలబడాల్సిన అవసరం ఉండదన్నారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ జానీ మియా పాల్గొన్నారు.

## మీసేవ కేంద్రానికి దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లాల గ్రామంలో మీసేవ కేంద్రం నిర్వహణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు.అభ్యర్థులకు మంచి కంప్యూటర్ పరిజ్ఞానం,కనీసం డిగ్రీ విద్యార్హత ఉండాలి. వయసు 21 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.అభ్యర్థి నార్కట్‌పల్లి మండల స్థానికుడై ఉండాలి.మీసేవ కేంద్రం నిర్వహణకు సొంత షాపు,స్థలం, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ తప్పనిసరి.రాత పరీక్ష మరియు మౌఖిక పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మీసేవ విభాగం నుంచి దరఖాస్తు ఫారములు తీసుకుని, విద్యార్హత, వయసు, నివాస ధృవపత్రాల జిరాక్స్‌లతో పాటు ఈనెల 10 నుంచి 18 వరకు మీసేవ పరిపాలనాధికారికి అందజేయాలన్నారు.